సాక్షి
గుంటూరు
బుధవారం ‌। 11 । జూన్ । 2025



వైభవంగా గ్రామోత్సవం

రేపల్లె: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కట్లమ్మ తల్లి జాతర

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం తురిమిళ్లలో కట్లమ్మ తల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: రేపూడిలోని వీరాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు చేశారు. నాగవల్లీ దళాలతో అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సాక్షి కార్యాలయంపై టీడీపీ నేతల దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన సిబ్బంది



తాడేపల్లి రూరల్: ఆత్మకూరులోని సాక్షి కార్యాలయంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం దాడి చేసిన సంఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పత్రిక ప్రతినిధులు, పాత్రికేయులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్‌ను సాక్షి మంగళగిరి ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ గోపి, బ్యూరోలు రమేష్, అశోక్, ఇతర మీడియా మిత్రులతో కలసి ఫిర్యాదు చేశారు. ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాక్షి కార్యాలయంపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను గుర్తించి కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ వెంకట్‌ను వారు కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన జోన్ చైర్మన్




పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి సందర్శించారు. గుంటూరు-1, 2 డిపోల పరిధిలోని గ్యారేజీలను తనిఖీ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతూ ప్రయాణికులను బస్సులో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ పరిధిలో స్టాల్స్‌ను స్వయంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్‌తో కలిసి రికార్డులు పరిశీలించారు.

వైకుంఠపుర వాసుడి సేవలో హైకోర్టు జడ్జి కుటుంబ సభ్యులు



తెనాలి: చిన్న తిరుపతిగా పేరొందిన స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జి.రఘురాం సతీమణి జి.భార్గవి, కుటుంబ సభ్యులు సందర్శించారు. స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవస్థాన పండితులు, అర్చకులు, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ వారికి ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల వద్ద జడ్జి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరులోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి చిలకపాటి భరద్వాజ కల్యాణమూర్తులను అలంకరించి పీటలపై కూర్చుండబెట్టి కళ్యాణ ధారణ గావించారు. గ్రామానికి చెందిన పలువురు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: సికింద్రాబాద్-కాకినాడ టౌన్ వయా గుంటూరు రైలును తాత్కాలికంగా రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ (07401) సికింద్రాబాద్-కాకినాడ టౌన్ రైలు ఈనెల 12న, రైలు నంబర్ (07402) కాకినాడ టౌన్-సికింద్రాబాద్ రైలు ఈనెల 13న తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తిరగబడ్డ ఆడబిడ్డ

కూటమిపై యుద్ధభేరి !

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళల కన్నెర్ర
- కూటమి పాలనపై నిరసన గళం
- మహిళలపై దాడులు, అత్యాచారాలపై మండిపాటు
- రాష్ట్రంలో కూటమి సర్కార్ పూర్తి వైఫల్యం చెందిందని ధ్వజం



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: మహిళా లోకం కన్నెర్ర చేసింది.. కూటమి సర్కార్ పాలనలో సాగుతున్న కక్షపూరిత విధానాలపై ధ్వజమెత్తింది.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి విలువనివ్వకుండా... రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందంటూ గర్జించింది.. దాడులు, అఘాయిత్యాలు నానాటికీ పెరిగిపోతున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారంటూ నిప్పులు చెరిగింది. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అరాచక వ్యవస్థల తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీదేవిరెడ్డి హాజరయ్యారు. రాజ్యాంగం సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

పోలీసుల 'పచ్చ'పాతం



బ్యారికేడ్లు నెట్టుకుని వెళుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, నూరిఫాతిమా తదితరులు

వైఎస్సార్ సీపీ నేతలు నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో టీడీపీ నేతలు కూడా అదే ప్రాంతంలో మరో కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే, వైఎస్సార్ సీపీ నేతలు 9.30గంటలకు నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పోలీసులు టీడీపీ నేతలు వస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం పక్క సందులో వారిని గంటకు పైగా నిలబెట్టారు. ఆ తర్వాత కూడా పోలీసులు అనుమతినివ్వకపోవడంతో మహిళలు ఇదేమని న్యాయమని ప్రశ్నించారు. మరో 10 నిముషాలు.. మరో 10 నిముషాలు అంటూ కాలయాపన చేస్తుండటంతో చిర్రెత్తుకువచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుగా పెట్టిన బ్యారికేడ్లను దాటుకువచ్చి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, మహిళా విభాగం నేతలు, పలు అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కూటమి సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి లైవ్ డిబేట్‌లో కృష్ణంరాజు మాట్లాడిన వ్యాఖ్యలకు సంబంధించి స్పష్టంగా యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు మహిళా లోకానికి స్పష్టమైన క్షమాపణలు చెప్పారన్నారు. అయినా కక్ష సాధింపు ధోరణితో ఆయనపై ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టడం సిగ్గుచేటని ఖండించారు. వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు పెట్టడంలో తప్పు లేదని, డిబేట్ నిర్వహించిన కొమ్మినేనిపై, సాక్షి యాజమాన్యంపై కేసు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడం సబబు కాదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. కేవలం కూటమి ప్రభుత్వం పొలిటికల్ డైవర్షన్‌లో భాగంగానే రాష్ట్రంలో అక్రమ కేసులకు తెరదీస్తున్నారని, ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో తన్మయి అనే విద్యార్థినిని హత్య చేశారని, ఓ బాలికను ఆరు నెలల పాటు 14 మంది అతి దారుణంగా రేప్ చేశారని, వీటిపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. కామాంధులను వదిలేసి కక్షసాధింపు చర్యలు ఏంటని ప్రశ్నించారు. ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ఇష్టానుసారంగా చానెల్‌లో జరిగిన అంశాన్ని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతమ్మలపై అంటగట్టే ప్రయత్నం చేస్తే సహించబోమని హెచ్చరించారు.



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, నూరిఫాతిమాతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

దాడులు సిగ్గుచేటు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ మహిళలపై సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తాము సమర్థించబోమని, యాంకర్‌గా పనిచేసిన కొమ్మినేని శ్రీనివాసరావుపై కేసులు పెట్టడం సబబు కాదని తెలిపారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేయటం సిగ్గుచేటన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే సాక్షిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.ఏపీలో క్రైమ్‌లు, అక్రమ కేసులు, దాడులు పెట్టడంలో మొదటి ప్లేస్‌కు రావటం తథ్యమని పేర్కొన్నారు.

సాక్షిపై అక్కసు దుర్మార్గం

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ మాట్లాడుతూ సాక్షిపై అక్కసు వెళ్లగక్కుతూ.. కూటమి ప్రభుత్వం దుర్మార్గపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, బుద్ధి చెప్పటం తథ్యమని హెచ్చరించారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధికారి ప్రతినిధి శ్రీదేవిరెడ్డి మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. అందుకు అనుగుణంగా కేసులు నమోదు చేయాలని గానీ, ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఎందుకు వినియోగించారని ప్రశ్నించారు. కేసు నమోదులో పోలీసులు పచ్చపాతాన్ని చూపించారని, స్వామి భక్తిని చాటుకున్నారని ఆరోపించారు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు నంద్యాల జిల్లాకు, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న యు.నరసింహారావును గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారిగా బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

■ గుంటూరు ఏడీఏగా పని చేస్తున్న తోటకూర శ్రీనివాసరావును మంగళగిరికి, మంగళగిరి ఏడీఏగా పనిచేస్తున్న గాయం శ్రీనివాసరెడ్డిని బాపట్లలోని రీజనల్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కి, బాపట్ల జిల్లా పర్చూరులో ఏడీఏగా పనిచేస్తున్న ఎస్.మోహనరావును గుంటూరు, గుంటూరులోని భూసార పరీక్ష కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న కె.అన్నపూర్ణమ్మను బాపట్ల ఏడీఏగా బదిలీ చేశారు.

■ గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారిగా యు.నరసింహారావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. అయితే, ఆయన ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన తర్వాత కడప జిల్లాలో డీడీఏగా పనిచేస్తున్న ఎ.నాగేశ్వరరావు గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించేలా ఢిల్లీ రావు ఉత్తర్వులు జారీ చేశారు.

రవాణా శాఖలో...

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖలో బదిలీలు జరిగాయి. గుంటూరులో మోటార్ వాహనం తనిఖీ అధికారులు గోపాల్‌ను చిలకలూరిపేటకు, సంధ్య నెల్లూరుకు, అనిల్ కందుకూరుకు, బాలకృష్ణ మంగళగిరికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో నరసరావుపేట మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్న శ్రావ్య, విజయ సారథి గుంటూరుకు బదిలీ అయ్యారు. మంగళగిరిలో అసిస్టెంట్ మోటర్ వాహన తనిఖీ అధికారిగా పనిచేస్తున్న పవన్ నరసరావుపేటకు బదిలీ అయ్యారు. నెల్లూరులో విధులు నిర్వహించే సాయి ధరమ్ తేజ్ తెనాలికి బదిలీ అయ్యారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

- జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి
- యోగాంధ్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

తాడేపల్లి రూరల్: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఎకో పార్క్ ఆవరణలో మంగళవారం యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పాల్గొన్నారు. యోగా ట్రైనర్లు హాజరైన వారితో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర- 2025 క్యాంపెన్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీఎఫ్‌ఓ (టెరిటోరియల్) హిమ శైలజ, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజావలితో కలిసి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆమె పాల్గొన్నారు. యోగా కార్యక్రమాల్లో ప్రజలను పెద్దఎత్తున భాగస్వామ్యులను చేసి యోగా ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో యోగా రిజిస్ట్రేషన్లను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని చెప్పారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు 14న నిర్వహించనున్న యోగాసనాల కార్యక్రమాలకు ప్రదేశాలను గుర్తించాలని ఆదేశించారు. ప్రదేశాలతో పాటు, మాస్టర్ ట్రైనర్స్ మ్యాపింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆజ్ఞాపించారు.

ఫలించిన గురువుల పోరాటం

- ఆందోళనలతో దిగి వచ్చిన ప్రభుత్వం
- ఎస్జీటీల బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అంగీకారం
- జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు
- కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులను పిలిచిన అధికారులు
- రాత్రి 8.30 గంటలకు కూడా మొదలు కాని కౌన్సెలింగ్



జెడ్పీ సమావేశ మందిరంలో వేచి చూస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్జీటీల బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, మాన్యువల్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలు ఫలించాయి. డీఈవో కార్యాలయాల ముట్టడి, నిరాహార దీక్షలతో తీవ్రమైన ఒత్తిడి తెచ్చిన ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చింది. ఎట్టకేలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అంగీకరించింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో మాన్యువల్ విధానంలో జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటూ విద్యాశాఖాధికారులు సోమవారం రాత్రి ఉపాధ్యాయులకు సమాచారాన్ని చేరవేశారు.

తొలుత 350 మందికి పిలుపు

సీనియార్టీ జాబితాలో పేర్లు ఉన్న మొదటి 350 మంది ఉపాధ్యాయులను పిలవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా వారంతా జెడ్పీ కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించాలి. విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి సీనియార్టీ జాబితాలతో పాటు కౌన్సెలింగ్‌కు సంబంధించి విధి, విధానాలు రావాలంటూ జిల్లా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను వేచి ఉండమని చెప్పారు. రాత్రి 8.30 గంటలకు కూడా పిలవక పోవడంతో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు జెడ్పీ ప్రాంగణంలోని చెట్ల కింద గడిపారు.



జెడ్పీ ప్రాంగణంలో చెట్ల కింద పడిగాపులు

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆగ్రహం

వెబ్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహణకు అంతా సిద్ధమని చెప్పిన అధికారులు మాన్యువల్ విధానానికి వచ్చేసరికి సీనియార్టీ జాబితాలు సిద్ధం కాలేదని చెప్పడంపై ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే గంటల కొద్దీ సమయాన్ని తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఆర్థికంగా పైసా భారం లేని బదిలీల విషయంలో ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

నేటికి వాయిదా వేసిన అధికారులు

రాత్రి 8.30 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రారంభించని అధికారులు సాంకేతిక కారణాలతో బుధవారం ఉదయానికి వాయిదా వేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఉపాధ్యాయులు నిరాశతో వెనుదిరిగారు. బుధవారం ఉదయం 9 గంటలకు వరుస క్రమంలో ఒకటి నుంచి 750 వరకు పేర్లున్న జెడ్పీ ఎస్జీటీ తెలుగు ఉపాధ్యాయులు హాజరు కావాలని డీఈవో సీవీ రేణుక సూచించారు. కాగా నగరపాలకసంస్థ, మున్సిపల్ ఉపాధ్యాయులకు వెబ్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

కంపెనీలతో చర్చలు జరిపిన రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం: పొగాకు కొనుగోలు చేసి రైతుల్ని ఆదుకోవాలని మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ బృందంతో కలసి ఇద్దరూ మంగళవారం గుంటూరులోని ఎలైన్స్ కేర్ అధినేత చేబ్రోలు రవీంద్ర, పోలిశెట్టి ఇండస్ట్రీ అధినేత పోలిశెట్టి శ్యాంలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది పొగాకుకు ధర ఉండటంతో రైతులు ఈ ఏడాది భారీగా సాగు చేశారని తెలిపారు. కొనుగోలు చేయడానికి కంపెనీలు ముందుకు రానందున అప్పుల్లో కూరుకుపోయి, తీవ్ర ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. ఇప్పటికే ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన రైతులు సైతం ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘాల ఆందోళనతో ప్రభుత్వం కూడా మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు ప్రారంభించిదన్నారు. ప్రైవేట్ కంపెనీలు కూడా కొనుగోలు త్వరగా చేస్తే రైతులకు రేటు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇతర కంపెనీలతో కూడా త్వరలో చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు మొహమ్మద్ ముస్తఫా ఉన్నారు.



చర్చల్లో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రి, రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య , ముస్తఫా

ఔరా.. సీఐ గారి స్వామిభక్తి !

- కోర్టు వద్ద అత్యుత్సాహం
- పచ్చ నేతలకు గులాం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రముఖ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై నమోదైన కేసుపై మంగళగిరి కోర్టులో మంగళవారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వాదోపవాదనలు జరిగిన అనంతరం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఆయన్ను రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు పటిష్ట భద్రత నడుమ సిద్ధమయ్యారు. ఇదే సమయంలో కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయాలని కోరుతూ ఆందోళన చేసిన కొంతమంది టీడీపీ కార్యకర్తలు కోర్టు వద్దకు వచ్చారు. ఆయన్ను తరలించే వాహనాన్ని చుట్టుముట్టడంతో వారిని పోలీసులు పక్కకు వెళ్లాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న గుంటూరు పట్టాభిపురానికి చెందిన సీఐ గంగా వెంకటేశ్వర్లు అత్యుత్సాహం చూపించారు. కిందిస్థాయి సిబ్బందిపై కేకలు వేస్తూ "వారిని ముందుకు పంపించు.. వారు ఏం చేశారు? ఎందుకు ఆపుతున్నావు?" అంటూ ఓవర్ యాక్షన్ చేశారు. పైగా కొమ్మినేనిని బయటకు తీసుకు వస్తుండగా టీడీపీ నాయకులకు ముందుకు రావాలని చెబుతూ సలహాలిచ్చారు. అక్కడున్న టీడీపీ నాయకులు "మేము ఏమీ మాట్లాడం" అంటూనే నిరసన తెలియజేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు అధికారి ఈ విధంగా ప్రవర్తించడంపై అక్కడున్న మీడియాతో పాటు లాయర్లు కూడా ఒక్కసారిగా అవాక్కయ్యారు. కొమ్మినేనిపై దాడి చేసే విధంగా టీడీపీ నాయకులను ప్రోత్సహించినట్లు ఆరోపణలు వినిపించాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎటువంటి అల్లర్లు జరకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తాము ఎండలో విధులు నిర్వహిస్తుంటే, టీడీపీ నాయకుల కార్లలో షికార్లు చేసి చివరి నిమిషంలో అక్కడకు వచ్చి సీఐ ఓవర్ యాక్షన్ చేయడంపై అక్కడున్న పోలీసులు కూడా అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ టీడీపీ నాయకుల మెప్పు కోసం ఇలా చేయడం సరికాదని, అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎవరు సమాధానం చెబుతారంటూ తోటి పోలీసులు చర్చించుకోవడం విశేషం.



నవ్వుతూ ఆందోళనకారుల్ని ప్రోత్సహిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు (వృత్తంలో)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,500

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	41497
అమ్మకాలు	38031
నిల్వ	7627

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-12,500
273	10,000-12,500
341	10,000-13,500
తాలుకాయలు	5,000-7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,600
బాడిగ-355	10,000 - 13,500
దేవనూరు డీలక్స్	10,000 - 13,800
తాలు	5,000 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 752

కొమ్ములు : 563 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,600	10,725	10,275

కాయలు : 189 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,600	10,725	10,275

మొత్తం అమ్మకాలు : 564.00 క్వింటాళ్లు

వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు పూర్తి ఆమోదం ఇవ్వనప్పటికీ, దేశవ్యాప్తంగా ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం – 2025 త్వరితగతిన అమలు చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గుంటూరులోని పెద్ద మసీదు, ప్రతిపాడు మండలం కొత్త మల్లాయపాలెం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 232-1, 2లో 233.18 ఎకరాలు, అంజుమనే ఇస్లామియా సంస్థకు సంబంధించిన చిన్న కాకానిలోని ఎన్నారై ఆసుపత్రి వెనుక ఉన్న 78 ఎకరాలను ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి పేరుతో ఏపీఐఐసీకి బదలాయించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఖండించారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. చిష్తి మాట్లాడుతూ రూ. 600 కోట్ల విలువ కలిగిన ఆస్తులను బదలాయించడం వక్ఫ్ నిబంధనలకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. ఆస్తులు నిర్వహణ పారదర్శకంగా జరగాలని, అవి కేవలం పేద ముస్లిం ప్రజల సంక్షేమం కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ కలీం, ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకుడు ఖాజావలి, ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బషీర్ అహ్మద్, డీఎంఎస్ జాతీయ నాయకుడు కె.వినయ్ కుమార్, జన చైతన్య వేదిక రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ రెడ్డి, హెల్ప్ లైన్ ఆర్గనైజేషన్ నాయకుడు ఎండీ జబ్బార్, సీఐటీయూ నాయకుడు కె.నళినీకాంత్, కౌలు రైతు సంఘం నాయకుడు బి.శ్రీనివాసరావు, ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు ఎస్.కె. బాజీ, టోపీ బాబు, ఆవాజ్ నాయకులు ఖాసీం వలి, ఎస్.కె.సైదా పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపుదలే లక్ష్యం

జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్



కిశోరి వికాసంలో మాట్లాడుతున్న డీసీపీఓ ప్రశాంత్

సత్తెనపల్లి: బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యంగా కిశోరి వికాసం పేరుతో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.ప్రశాంత్ అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కౌమార దశలో బాలికల్లో అనారోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు కిశోర వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత నెల 2వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం మంగళవారంతో ముగిసిందన్నారు. ప్రధానంగా మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. బాలల హక్కులు, చట్టాల మీద వీడియో క్లిప్పింగ్ చూపిస్తూ పిల్లలకు, తల్లులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రజుమంలో ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.వరలక్ష్మి, జోజికుమారి, ఆయాలు ఎస్.భారతి, కుమారి, కౌమార బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్న అధికారులు: ఏపీటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీల కౌన్సెలింగ్ పేరుతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్‌కు రమ్మని పిలిచిన అధికారులు రాత్రి 8 వరకు ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో ఖాళీలను తారుమారు చేశారని, వెబ్ వద్దని పట్టుబట్టి మాన్యువల్ బదిలీలు కోరిన ఉపాధ్యాయులపై విద్యాశాఖ డైరెక్టర్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫిరంగిపురం మండలం మొత్తాన్ని ప్రిఫరెన్షియల్ కేటగిరీగా చూపారని పేర్కొన్నారు. నరసరావుపేట మండలం లింగంగుంట్లలో ఉన్న నలుగురిలో ఇద్దరు ప్రిఫిరెన్షియల్ కేటగిరీల్లో పని చేస్తుండగా, మరో రెండూ ఆ కేటగిరీలోనే చూపారని పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధం చేసిన జాబితాలు, ఖాళీలు మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ఏ విధంగా మారుతాయని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేందుకే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన జట్లతో ఐఎస్ నాగిరెడ్డి, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీలు

సత్తెనపల్లి: జిల్లాస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పల్నాడు జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఐఎస్ నాగిరెడ్డి పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగాయి. ఈ ఎంపికల్లో ఐఎస్ నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెలక్షన్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది మెన్, 40 మంది ఉమెన్ ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీరామ్‌రెడ్డి, అచ్చిరెడ్డి, మహబూబ్ సుభాని, నరసింహారావు, షేక్ మస్తాన్‌వలి, పీడీ శ్రీనివాసరావు, పీడీ రియాజు పాల్గొన్నారు. రిటైర్డ్ పీడీ ఐఎస్ నాగిరెడ్డిని, అతిథులను పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఘనంగా సత్కరించారు. జిల్లాకు సెలెక్ట్ అయిన ఫుట్‌బాల్ క్రీడాకారులు త్వరలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్



టోర్నమెంట్ విజేతలకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

క్రోసూరు: క్రోసూరులోని జెడ్పీపాఠశాల ఆవరణలో గత నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. మొత్తం 40 జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌లో వైఎంసీఏ, క్రోసూరు జట్టు విజేతగా నిలిచి, ట్రోఫీతోపాటు ప్రథమ బహుమతి కింద రూ.50,116లు అందుకుంది. రన్నర్స్‌గా సాయిసీసీ, క్రోసూరు జట్టు నిలిచింది. ఆ జట్టుకు రూ.25,116 అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన పిడుగురాళ్ల జట్టుకు రూ.10,116 అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ పిడుగురాళ్లకు చెందిన ప్రకాష్‌కు రూ.2,116, బెస్ట్ బౌలర్ క్రోసూరుకు చెందిన కోటి రూ 2,116 నిర్వాహకులు అందజేశారు. పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానుల, మాజీ యార్డు చైర్మన్ యేపూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు ఛిన్నాభిన్నం

సీడీపీఓ సుచిత్ర



బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ సుచిత్ర

రేపల్లె: బాల్య వివాహాలతో బాలల జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని, బాలికలపై లింగవివక్షతను వీడాలని సీడీపీఓ సుచిత్ర పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. లింగవివక్ష చూపేవారు చట్టరీత్యా శిక్షర్హులన్నారు. బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్‌నేరాలు అధికంగా ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తల్లిదండ్రులకుగాని, ఉపాధ్యాయులకుగాని తెలియజేయాలని సూచించారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి హిమబిందు, సూపర్‌వైజర్ శివజ్యోతి పాల్గొన్నారు.

పొలిమేరను పరిశీలించిన ఆర్డీఓ



పొలిమేరను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీఓ

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు, ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామాల సరిహద్దులోని పొలిమేరను చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. కొణికి గ్రామానికి చెందిన రైతులు వారి సరిహద్దులో చందలూరు వైపు నుంచి పారుతున్న వర్షపు నీరు అడ్డుకునేందుకు మట్టితో కట్టలు వేశారు. దీనివల్ల చందలూరు గ్రామంలోనే వర్షపు నీరు నిల్వ ఉంటూ పంట పొలాలు దెబ్బతింటున్నాయి. దీంతో చందలూరు రైతులు అధికారులను ఆశ్రయించారు. ఈ విషయమై గతంలో తహసీల్దార్ ఇతర అధికారులు పరిశీలించారు. కొణికి గ్రామ రైతులకు నోటీసులు కూడా పంపారు. ఈ విషయమై మళ్లీ పరిశీలించేందుకు చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు వెళ్లారు. సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులు మార్గం చూపాలని వర్షపు నీటి పారుదల కోసం తూములు ఏర్పాటు చేసి ఇరువర్గాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంగులూరు మండల తహసీల్దార్ పి. సింగారావు, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, ఇరు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



షేక్ బుజ్జి హుస్సేన్ మృతదేహం

ప్రత్తిపాడు: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మరణించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు గ్రామానికి చెందిన షేక్ బుజ్జి(64) హుస్సేన్ స్థానిక పోలిశెట్టి టొబాకో కంపెనీలో క్లినిక్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలానే విధులకు హాజరైన ఆయన కంపెనీ ఆవరణలో ఉన్న దేవుని విగ్రహాలకు పూజ చేసేందుకు గాను వాటిని శుభ్రపరిచేందుకు ప్రాంగణంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదశాత్తూ చెరువులో పడిపోయాడు. గమనించిన కోటయ్య అతని చేతిని అందించి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కంపెనీ సిబ్బంది సమాచారాన్ని హుస్సేన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు తీవ్రంగా శ్రమించి మృతదేహాన్ని వెలికి తీయాల్సి వచ్చింది. గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మృతుని భార్య షేక్ అఫ్జలున్‌బి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక యువతి ఆత్మహత్య

తెనాలి రూరల్: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక మహిళ అపార్ట్‌మెంట్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన చీమకుర్తి సుబ్రహ్మణ్యం(60) మంగళవారం మధ్యాహ్నం గుండెల్లో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యశాల సిబ్బంది చెప్పడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికే సుబ్రహ్మణ్యం పెద్ద కుమార్తె లక్ష్మీశ్రావణి(23) వారి ఇంటి సమీపంలోని అపార్ట్‌మెంట్ పైకి ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఏడాది కిందట విజయవాడకు చెందిన వ్యక్తితో వివాహమైంది. మనస్పర్థల కారణంగా పుట్టింట్లో ఉంటూ ఎంబీఏ చదువుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిపాలన చేతగాక డైవర్షన్ రాజకీయాలు

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లా



వినుకొండ: రాష్ట్రంలో పరిపాలన చేతగాకే కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందని, ఇందులో భాగంగానే సాక్షి మీడియాపై దాడులు జరిగాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సాక్షి కార్యాలయాలపై టీడీపీ గూండాల దాడులను తీవ్రంగా ఖండించారు. తనకు సంబంధం లేని వ్యాఖ్యలపై, తనకు అవసరం లేకున్నా కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ చెప్పారని, అయినా ఆయన్ను అక్రమంగా అరెస్టు చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏదోక వంకతో సాక్షి కార్యాలయాలు, జర్నలిస్టులపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పరిపాలనపై దృష్టిసారించాలని చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల హైవే సమీపంలోని యాదవ్ కూల్ డ్రింక్స్ దుకాణం వద్ద పీడీఎస్ బియ్యం బస్తాలు 325 గుంటూరు నుంచి కృష్ణపట్నానికి అక్రమంగా కంటైనర్‌లో తరలిస్తున్నారు. మేదరమెట్ల ఎస్‌ఐ మహ్మద్ రఫీ సిబ్బందితో దాడి చేసి బియ్యం బస్తాలను కంటైనర్ వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

15 లోపు దరఖాస్తు చేసుకోవాలి



రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఇంగ్లీష్ మీడియంలో 2025-26 విద్యాసంవత్సరం ప్రవేశం కోరు బాలురు ఈ నెల 15వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ కోరారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపాల్ మోహన్ మాట్లాడుతూ ఖాళీలను తరగతుల వారీగా రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, పీహెచ్‌సీలకు 3 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. 5 వ తరగతిలో 40 ఖాళీలు, 6వ తరగతిలో 10 ఖాళీలు, 9వ తరగతి లో 9 ఖాళీలు ఉన్నాయన్నారు. బ్లాక్‌లాగ్ సీట్లకు ఎస్టీలు మాత్రమే అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 16వ తేదీన పాఠశాలలో తరగతుల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, తల్లిదండ్రుల రేషన్‌కార్డును జత చేసి పాఠశాలలో అందజేయాలన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్య బోధించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 8333925177 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణుల దాడి

తీవ్ర గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స

రాజుపాలెం: తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. కొత్త బోధనంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాంపాటి శ్రీహరి ఆటో తీసుకుని పెట్రోల్ బంక్ వద్ద గల టీ స్టాల్‌లో టీ తాగుతుండగా అదే సమయంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలైన తోట అంజనేయులు, తోట నరసింహస్వామి, వేల్పుల నరసింహారావులు ద్విచక్ర వాహనంపై టీ స్టాల్ వద్ద ఆగిఉన్న ఆటోను తగిలి కిందపడ్డారు. వెంటనే తేరుకుని మాకే ఆటో అడ్డం పెడతావురా... అంటూ దుర్భాషలాడుతూ రాంపాటి శ్రీహరిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి పారిపోయారు. ఈ దాడిలో శ్రీహరికి తీవ్రగాయాలు తగలడంతో బంధువులు సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వేణిగోపాల్ సిబ్బందితో సత్తెనపల్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాంపాటి శ్రీహరి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

బాపట్ల డీఎస్‌ఓగా జమీర్‌బాషా

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి(డీఎస్‌ఓ)గా జమీర్‌బాషాను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ విభాగంలో జిల్లా అధికారిగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీఎస్‌ఓగా పనిచేస్తున్న విలియమ్స్‌ను బదిలీపై ఏలూరు జిల్లా డీఎస్‌ఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సైనిక నియామకాల్లో పారదర్శకత

ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి మేజర్ అనుదీప్ కుమార్



ఎన్‌సీసీ కేడెట్‌లకు అవగాహన కల్పిస్తున్న కెప్టెన్ అనుదీప్ కుమార్

వేటపాలెం: సైనిక నియామకాల్లో పారదర్శకత పాటిస్తామని గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి మేజర్ అనుదీప్ కుమార్ పేర్కొన్నారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్లకు సైనిక నియామకాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైన్యంలో జవాన్లు, నాన్ కమీషన్డ్ అధికారులు, టెక్నికల్ ఎంట్రీ, ఆర్మీ నర్సులు, లాజిస్టిక్స్ తదితర విభాగాల ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు. సైనిక నియామకాలపై నేరుగా అధికారిక వెబ్‌సైట్ లేదా సైనిక రిక్రూట్‌మెంట్ కార్యాలయాల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా యువతకు శారీరక, మానసిక తయారీ కోసం పలు సూచనలు ఇచ్చారు. సైనికాధికారిని ఘనంగా సన్మానించారు. కెప్టెన్ పోతూరి శ్రీనివాస్, లెఫ్టినెంట్ హరీష్, రాజేష్‌బాబు, దివ్య, శ్రీమన్నారాయణ, శేషగిరిరావు, ఫాతిమా, గోపీనాథ్, సుబేదార్ ముకేశ్‌కుమార్, సబూర్, అవతార్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు కృష్ణానదిలో ఫ్లోటింగ్ యోగా

వివరాలు వెల్లడించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025లో భాగంగా ఈ నెల 11వ తేదీన బెరం పార్కు వద్ద కృష్ణా నదిలో 'యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగాతో ప్రపంచ రికార్డును సొంతం చేసుకునేలా మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డును కైవసం చేసుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 200 వాటర్ క్రాఫ్ట్స్‌పై వెయ్యిమందితో కామన్ యోగా ప్రోటోకాల్‌తో యోగాసనాలు వేస్తున్నట్లు చెప్పారు. వరల్డ్ రికార్డ్స్ యూనియన్ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రపంచ రికార్డుగా నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు..

ఫ్లోటింగ్ యోగా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, సుశిక్షితులైన బోట్ ఆపరేటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. సమావేశంలో అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామత్లేహి, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఫ్లోటింగ్ యోగా కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మంగళవారం పరిశీలించారు. ప్రపంచ రికార్డ్‌ను సొంతం చేసుకునేలా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్‌లో యోగా ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొననున్నందున ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా భద్రత, ఇతర ఏర్పాట్లను చేయాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. బారికేడింగ్, సీటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చూడాలని సూచించారు.